అవగాహనతోనే కుష్ఠు నివారణ

- ప్రత్యేక బృందాలతో కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- ఈనెల 24 వరకు కొనసాగనున్న కార్యక్రమం

నెహ్రూసెంటర్: కుష్ఠువ్యాధిని అవగాహనతోనే నివారించవచ్చని వైద్యారోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా నయం చేయవచ్చని తెలుపుతున్నారు. ఈక్రమంలో వ్యాధి నివారణ, నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 10నుంచి వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టారు. రెండో విడత సర్వే నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. వ్యాధిసోకిన వారికి చర్మంపై స్పర్శలేని మచ్చలు ఏర్పడడం, నరాలపై ఈవ్యాధి ప్రభావం చూపుతుందని, దీని ద్వారా అంగవైకల్యం ఏర్పాటే అవకాశాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు.

ఇంటింటి సర్వే

జిల్లాలో పెరుగుతున్న కుష్ఠు వ్యాధిగ్రస్తుల దృష్ట్యా ఇంటింటి గుర్తింపు సర్వే చేపట్టేలా వైద్యశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రతి ఆశకార్యకర్త, వైద్య సిబ్బంది ఒక బృందంగా జిల్లా వ్యాప్తంగా 884 బృందాలు ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తుల గుర్తింపు


శరీరంపై ఉన్న మచ్చలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని 21 పీహెచ్‌సీల పరిధిలో ఈ బృందాలు సర్వేలో పాల్గొంటాయి.

14 రోజులపాటు సర్వే..

కుష్ఠు నిర్మూలన కోసం చేపడుతున్న కార్యక్రమంలో సోమవారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు 14రోజుల పాటు సర్వే నిర్వహించనున్నారు. వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం ఏర్పాటు చేసిన బృందాల ఆధ్వర్యంలో సర్వే చేయనున్నారు. పట్టణాలు, గ్రామాల్లో ఇంటింటికి సర్వే చేసి అనుమానితులను గుర్తించి సమీపంలోని సబ్‌సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రికి పంపించనున్నారు.

సర్వే బృందాలకు సహకరించాలి



కుష్ఠువ్యాధి నిర్మూలన అవగాహనతోనే సాధ్యం. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా నిర్మూలించవచ్చు. చర్మంపై స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే సమీప పీహెచ్‌సీలో ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చు. సర్వే కోసం ఇంటింటికి వచ్చే సర్వే బృందాలకు ప్రతీ ఒక్కరు సహకరించాలి.

– డాక్టర్ బిందుశ్రీ, లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్

వ్యాధి కట్టడికి కృషి చేయాలి

తొర్రూరు: కుష్ఠు వ్యాధి కట్టడికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని డీపీఎంఓ చెప్యాల వనాకర్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని పలుగ్రామాల్లో సోమవారం కుష్ఠు వ్యాధి బాధితుల గుర్తింపు కోసం ఇంటింటి సర్వే చేపట్టారు. డివిజన్ వ్యాప్తంగా 270 బృందాలు, 25 మంది పరిశీలకులను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రుద్రపతి విజయ్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోటీకి పనికిరాని నాయకుడు

- ఎంపీ మాలోత్ కవిత

కురవి: మానుకోట అసెంబ్లీకి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకే పనికిరాని నాయకుడు పార్లమెంట్‌కు పనికి వస్తాడా? అసెంబ్లీకి చెల్లని రూపాయి.. పార్లమెంట్‌కు చెల్లుతుందా? అని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి అయిన బలరాంనాయక్‌ను ఉద్దేశించి మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉమ్మడి కురవి మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు తోటలాలయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పనికిరాని బలరాంనాయక్ ఇప్పుడు పార్లమెంట్‌కు ఎలా పనికివస్తాడో తెలుసుకోవాలని విమర్శించారు. తాను ఎంపీగా గెలిచి నియోజకవర్గం మొత్తం తిరిగి ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేశానన్నారు. ఆడబిడ్డగా ఆదరించాలని ఆమె కార్యకర్తలను కోరారు. ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్‌కు ఓటేశారని ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ అన్నారు. చాలా మంది బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పార్టీ మారుతారని అంటున్నారని, ఎవరిని బతిమిలాడనని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో మనోళ్లే ఓటేయలేదని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. కాగా కార్యక్రమానికి కురవి జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, గుండ్రాతిమడుగు(వి


కురవి: మాట్లాడుతున్న ఎంపీ మాలోత్ కవిత

లేజీ) సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి డుమ్మా కొట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోత్ పద్మావతిరవినాయక్, వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, నాయకులు కుడితిమహేందర్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలి

గూడూరు: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని రాష్ట్ర నాయకుడు భీరవెళ్లి భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. మొదటి నుంచి పార్టీలో పనిచేసిన వారికే గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, బోడ కిషన్, సంపత్‌రావు, యశ్‌పాల్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సోమునాయక్, రహీంపాష, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కేసముద్రం: మండలంలోని పెనుగొండ శివారు కట్టుగుడెంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను స్పెషల్ ఆఫీసర్ కాలేరు యాదగిరి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొమురయ్య, అశోక్, శ్రావణ్ పాల్గొన్నారు.

బీజేపీకి రాజీనామా



చిన్నగూడూరు: బీజేపీకి రాజీనామా చేసినట్లు పార్టీ మండల అధ్యక్షుడు బోయిని యాకన్న సోమవారం తెలిపాడు. రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు ఎలమంచి వెంకటేశ్వర రావుకు పంపినట్లు పేర్కొన్నాడు.

సవార్ లచ్చమ్మ పండుగ



తొర్రూరు రూరల్: మండలంలో గుర్తూరు గ్రామంలోని దళిత కాలనీలో సవార్ లచ్చమ్మ పండుగ వేడుకలను అత్యంత వైభవంగా సోమవారం నిర్వహించారు. ప్రధానంగా దళిత కాలనీకి చెందిన కులస్తులంతా కలిసి డప్పుచప్పుళ్లతో నృత్యాలు చేస్తూ జలబిందెలతో సవార్ లచ్చమ్మ దేవాలయాన్ని, విగ్రహాలను శుద్ధి చేశారు. అనంతరం నైవేద్యంతో కూడిన బోనాలను డప్పుచప్పుళ్ల, ఆటపాటలు, నృత్యాలతో సవార్ లచ్చమ్మకు బోనాలు సమర్పించారు. పసుపు, కుంకుమ, దుస్తులను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: మండలంలోని అయోధ్యపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ అమ్ములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కొత్తగూడ: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా నేరాలు తగ్గుతాయని ఎస్సై దిలీప్ అన్నారు. దొరవారివేంపల్లి విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సువర్ణపాక కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసంపై ఫిర్యాదు

డోర్నకల్: మండలంలోని గుర్రాలకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని టేకులతండాలో నూతనంగా నిర్మిస్తున్న సిమెంటు రోడ్డును ధ్వంసం చేశారంటూ స్థానిక కాంగ్రెస్ నాయకులు సోమవారం డోర్నకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన అనంతరం గుర్రాలకుంట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాళోత్ బావ్‌సింగ్ మాట్లాడుతూ.. రూ.8లక్షల ఈజీఎస్ నిధులతో గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టగా పనులు ముగింపు దశలో ఉండగా కొంతమంది ఉద్దేశపూర్వకంగా రోడ్డును ధ్వంసం చేశారని తెలిపారు. రోడ్డు ధ్వంసం చేసిన వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బావ్‌సింగ్ తెలిపారు.

ఎస్సీఆర్పీఎస్ మండల కమిటీ ఎన్నిక


ఐలయ్య, ప్రధాన కార్యదర్శి

పెద్దవంగర: షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ సమావేశాన్ని సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. అనంతరం చేపట్టిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడి సోమారపు వీరస్వామి సమక్షంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఎస్సీఆర్పీఎస్ మండల అధ్యక్షుడిగా జలగం పవన్, ప్రధాన కార్యదర్శిగా చింతల ఐలయ్య, ఉపాధ్యక్షుడిగా రాంపాక ఐలయ్య గౌరవ అధ్యక్షుడిగా జలగం శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా సిద్ధూ, కార్యవర్గ సభ్యులుగా మచ్చ చెన్నయ్య, హరీశ్, నవీన్, గౌరవ సలహాదారులుగా యాకయ్య, కిరణ్ కుమార్ నియమితులయ్యారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం..

ఖానాపురం : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే పథకాలను ఇంటింటికీ అందిస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో తలపెట్టిన గౌడ కులసంఘం భవన నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తామన్నారు.

ఎంపీపీ వైఖరి నచ్చకనే పార్టీ వీడుతున్నాం..

పెద్దవంగర: ఎంపీపీ ఈదురు రాజేశ్వరి వైఖరి భరించలేకపోతున్నామని పెద్దవంగర వైస్ ఎంపీపీ బొమ్మెరబోయిన కల్పన, ఎంపీటీసీలు బానోతు రవీందర్ నాయక్, బానోతు విజయ, ఈరెంటి అనురాధ, మెట్టు సౌజన్య, ఎర్ర సబితలు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అండదండలతో ఎంపీపీ భర్త బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సహచర ఎంపీటీసీ సభ్యులను బెదిరిస్తూ అవమాన పరిచాడని పేర్కొన్నారు. దీంతో బీఆర్‌ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వారు


వైస్ ఎంపీపీతో ఎంపీటీసీలు

తెలిపారు. రాజీనామా లేఖను బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్‌కి పంపినట్లు వెల్లడించారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మహబూబాబాద్: గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.రవి డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డీపీఓ కార్యాలయంలో డీపీఓ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ.. కార్మికుల 9నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండి నానా తంటాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత మంత్రి జోక్యం చేసుకుని వేతనాలు విడుదల చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే విడుదల చేయకపోతే జేఏసీగా ఏర్పడి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యం, మల్లేష్, సోమనర్సయ్య, రవి, యాకయ్య పాల్గొన్నారు.


మహబూబాబాద్: డీపీఓకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తొర్రూరు: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య తెలిపారు. పంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ అనుబంధ జీపీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే


తొర్రూరు: వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అధికార పార్టీ నాయకులకు వినతిపత్రం సమర్పించారు. వెంకటయ్య మాట్లాడుతూ.. మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఏడు మాసాల పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వెంకన్న, దేవేందర్ పాల్గొన్నారు.

ముగిసిన జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలు


షీల్డు అందజేస్తున్న ఎస్సై సతీష్

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మూడు రోజులుగా జరిగిన జోనల్ స్థాయి కబడ్డీ క్రీడలు ఆదివారం అర్ధరాత్రి ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు షీల్డ్‌లు, నగదును దాతలు అందజేశారు. రాజీవ్ యువసేన అధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో ఎస్సై సతీష్ ముఖ్య అతిథిగా బహుమతులు అందజేశారు. నూతన్‌కల్ జట్టు విజేతగా నిల్వగా షీల్డు, రూ.40వేల నగదు అందజేశారు. ద్వితీయ జట్టు ఎర్రబాడుకు రూ.30వేలు, తృతీయ జట్టు భూపాలపల్లికి రూ.25వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్, దాతలు బండ శ్రీనువాస్‌రెడ్డి, జినుకల వెంకట్రాం నర్సయ్య, గణేష్, ఎల్లారెడ్డి, దస్రూ, లింగారెడ్డి, రాజేందర్, నిర్వాహకులు యాదగిరి, అనిల్, శ్రీకాంత్, యాకయ్య పాల్గొన్నారు.

సూరయ్య మృతి పార్టీకి తీరనిలోటు

గార్ల: బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు లింగాల సూరయ్య అకాల మరణం పార్టీకి తీరని లోటని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. సోమవారం మండలంలోని పాతపోచారం గ్రామంలో సూరయ్య దశదిన కర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీ వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి ఉమేష్, కోఆప్షన్ ఖదీర్, రాధాకృష్ణ, మురళి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కళాకారుడి మృతి

కురవి: తెలంగాణ ఉద్యమకారుడు, ప్రజానాట్యమండలిలో పనిచేసిన ప్రజాకళాకారుడు, బీఆర్‌ఎస్ నాయకుడు బోయపోతుల సోమయ్య(53) సోమవారం మండలంలోని రాజోలు శివారు స్టేషన్‌గుండ్రాతిమడుగు గ్రామంలో గుండెపోటుతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి తప్పెట్ల వీరన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి నీరుడు సామేల్, ఉద్యోగ సంఘాల రాష్ట్ర నాయకుడు లింగంపల్లి దుర్గయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి


నివాళులర్పిస్తున్న బండి పుల్లయ్య

బి.విజయసారథి, పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి నివాళులర్పించారు.

గంగాభవాని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మరిపెడ రూరల్: మండలంలోని పురుషోత్తమాయగూడెం ఆకేరు వాగు ఒడ్డున నూతనంగా నిర్మించిన ఆలయంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గంగాభవాని దేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ నూకల అభినవ్‌రెడ్డి దంపతులు హోమం పూజల్లో పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో వంటికొమ్ము


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎంపీ

యుగేందర్‌రెడ్డి, పెండ్లి రఘువీర్‌రెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పార్టీలోకి రావొద్దు

మరిపెడ రూరల్: ప్రజలు తిరస్కరించిన తాళ్ల ఊకల్ బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి రావొద్దని అదే గ్రామానికి చెందిన సీమ సురేష్, గుగులోతు దస్రు అన్నారు. మరిపెడ మండలంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఊసరవెల్లిలా రంగుమార్చే నాయకులు పార్టీలోకి వస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో నాయకులు ఆకుల నరేష్, నరేందర్, మురళి, శ్రీనివాస్, ఉపేందర్, రవీందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి రావడం తగదు

నర్సింహులపేట: బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి రావడం సబబు కాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జినుకల రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరే బీఆర్‌ఎస్ నాయకులు నిజాయితీని నిరూపించుకొని రావాలన్నారు. అవసరమైతే అధిష్ఠానం వద్దకు వెళ్తామని, లేని పక్షంలో రాజీనామాలు చేస్తామని హెచ్చరించాడు.

సాహిత్య ఉత్సవ పోటీలకు యాకమ్మ

మహబూబాబాద్ అర్బన్: ఢిల్లీ కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ జాతీయ ఉత్సవ సాహిత్య పోటీల్లో మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన యాకమ్మ పాల్గొన్నారు. ఉపాధ్యాయురాలు, కవయిత్రి యాకమ్మ సోమవారం హాజరై ఆమె రచించిన తొలిపొద్దు, వెన్నల గొడుగు, మౌనరాగం మూడు కవితలు తెలుగు, ఇంగ్లిష్ భాషలో కవిత పఠనం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తొర్రూరు రూరల్: మండలంలోని చింతలపెల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ బూత్ కన్వీనర్ బొలగాని మహేష్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్ పరామర్శించి, ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు పెదగాని సోమయ్యగౌడ్, అశోక్‌రెడ్డి, మధు, మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

భూమిపూజ



పెద్దవంగర: మండలంలోని చిన్నవంగర గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం భవన నిర్మాణానికి సోమవారం ఎంపీడీఓ వేణుమాధవ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాకనాటి రాము రెడ్డి, ఎంపీఓ సత్యనారాయణ, పీఆర్‌ఏఈ దయాకర్, జీపీ కార్యదర్శి గీత పాల్గొన్నారు.

మెజార్టీ ముస్లింల మద్దతుతో ఎన్నిక



డోర్నకల్: ఇటీవల ఏర్పాటు చేసిన ఉస్మానియా మసీదు కమిటీ మెజార్టీ ముస్లింల మద్దతుతో ఎన్నుకున్నట్లు డోర్నకల్ ముస్లిం పెద్దలు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ.. మెజార్టీ ముస్లింల మద్దతుతోనే కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. రాజకీయాలకతీతంగా ఏర్పాటు చేసిన కమిటీ త్వరలో కోర్టు సమస్యలు పరిష్కరించుకుని వక్ఫ్‌బోర్డు ఆమోదం పొందుతుందని తెలిపారు. సమావేశంలో సలీంపాషా, అబ్దుల్, గౌస్, మునీర్, అజీత్‌మియా, రషీద్‌జాని, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పదోన్నతులు గిరిజనులతో చేపట్టాలి

బయ్యారం: ఏజెన్సీ ప్రాంతంలోని ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు ఆదివాసీ, బంజారా గిరిజనులతో చేపట్టాలని టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మాలోత్ రామారావు ప్రభుత్వంను డిమాండ్ చేశారు. సోమవారం బయ్యారంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు రూప్లా నాయక్, బాబురావు, బన్సీలాల్, లింగ్యా, మంగీలాల్, రంగన్న పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య


మల్సూర్ (ఫైల్)

కురవి: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సీరోలు మండలం రేకులతండాలో సోమవారం చోటుచేసుకుంది. సీరోలు ఎస్సై విజయ్‌రాంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రేకులతండాకు చెందిన తేజావత్ మల్సూర్(30) తండాకు దుస్తులు అమ్మేవాడు వచ్చాడని, కుమారుడిని డ్రెస్సు కొనాలని భార్య స్వాతితో చెప్పాడు. డ్రెస్సు కొనుగోలు విషయంలో ఇద్దరికి చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో స్వాతి పుట్టింటికి (బూర్గు చెట్టు తండా) వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన మల్సూర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వివరించాడు. మృతుడి తండ్రి కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నాడు. మృతుడికి భార్య, బాబు, పాప ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ


తొర్రూరు రూరల్: పంపిణీ చేసిన పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులందరికీ సుమారు రూ.10వేల విలువ చేసే నోటు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను మృత్యుంజయరాజ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సాయికిరణ్, మరియమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు మండల కేంద్రానికి చెందిన ఎనగండ్ల కృష్ణారెడ్డి సోమవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ


నర్సింహులపేట: కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో..

చేశాడు. కార్యక్రమంలో ఎస్ఓ స్వప్న, సీనియర్ పాత్రికేయుడు ఈరగాని బిక్షంగౌడ్, బండి రమేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’లో గందరగోళం


క్యూలో గృహజ్యోతి లబ్ధిదారులు

మహబూబాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల అమలు కోసం అభయహస్తం ప్రజాపాలన దరఖాస్తులను లబ్ధిదారుల నుంచి గత ఏడాది డిసెంబర్ 28నుంచి ఈ ఏడాది జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంను నిర్వహించిన విషయం తెలిసిందే. గృహజ్యోతి పథకం క్రింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు 200 యూనిట్ల లోపు బిల్లు వచ్చినా జీరో బిల్లులు రాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. దానిలో భాగంగా ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాగా స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రానికి పెద్ద ఎత్తున లబ్ధిదారులు సంబంధిత పత్రాలతో వచ్చారు. రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ సిబ్బందికి ఈ వ్యవహారం పెద్ద తలనొప్పిగా మారింది.

5నెలలుగా వేతనం రావడం లేదు

మరిపెడ రూరల్: గ్రామాల్లో చేతి పంపులు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి ప్రజల దాహం తీర్చే మెకానిక్‌కు 5నెలలుగా వేతనం రాక ఇబ్బందులు పడుతున్నాడు. ఈసందర్భంగా బాధితుడు బానోతు బిచ్చు తన ఆవేదనను విలేకరుల ఎదుట వెల్లబోసుకున్నాడు. మరిపెడ మండల పరిషత్ కార్యాలయంలో గత 32 ఏళ్లుగా చేతి పంపులకు మరమ్మతులు చేస్తున్నాడు. ఇంతకాలం పని చేసిన పర్మనెంట్ కాకపోగా నెలనెల ఇచ్చే జీతం ఇవ్వడం లేదని వాపోయాడు. నెలకు మూడు గ్రామ పంచాయతీల చొప్పున తనకు రూ.13,000 చెల్లించాలన్నాడు. 5 నెలలుగా వేతనం రాకపోవడంతో కుటుంబం గడవడం ఇబ్బందిగా ఉందన్నాడు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే జీపీలకు నిధులు రావడం లేదని సాకు చెబుతున్నారని బాధితుడు బిచ్చు తెలిపాడు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ వేతనం డబ్బులు చెల్లించాలని వేడుకున్నాడు.